సాక్షి అనకాపల్లి

బుధవారం, 13, సెప్టెంబర్, 2023



ఉత్తమ ఆచార్యుడికి సత్కారం

విశాఖ: బెస్ట్ రీసెర్చర్ అవార్డు పొందిన ఏయూ జియో ఇంజినీరింగ్ విభాగాధిపతి వజీర్ మహ్మద్‌ను ఘనంగా సత్కరించారు.



నీతి ఆయోగ్ సీఈవోకి స్వాగతం

డాబాగార్డెన్స్: విశాఖ వచ్చిన నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యంకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ స్వాగతం పలికారు.

వర్షసూచన

అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజులు మోస్తరు వర్షసూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న 35, 14న 12, 15న 4, 16న 4, 17న 4 మి.మీ వర్షపాతం, 32.4 నుంచి 32.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

న్యూస్‌రీల్

పెండింగ్ పింఛన్లకు డబ్బులు విడుదల

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం : ఇప్పటి వరకు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉండిపోయిన పింఛన్లు అన్నీ ప్రభుత్వం మంజూరు చేసిందని, వాటికి సంబంధించిన సొమ్ము కూడా విడుదల చేసిందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మంగళవారం తెలిపారు. జిల్లాలో ఈ పింఛన్ సొమ్ము రూ. కోటి 42 లక్షల 91 వేలు విడుదల కాగా చోడవరం నియోజకవర్గానికి రూ. 23 లక్షల 47 వేల 500 పింఛన్ సొమ్ము వచ్చిందన్నారు. చోడవరం మండలానికి రూ. 6 లక్షల 34 వేల 750, బుచ్చెయ్యపేట మండలానికి రూ. 5 లక్షల 36 వేలు, రావికమతం మండలానికి రూ.7 లక్షల 47 వేలు, రోలుగుంట మండలానికి రూ. 4 లక్షల 29 వేల 750 విడుదలయిందని ధర్మశ్రీ చెప్పారు. త్వరలోనే వలంటీర్ల ద్వారా పింఛన్‌దారులకు పంపిణీ చేయనున్నట్లు ధర్మశ్రీ తెలిపారు.

2న యువతకు వక్తృత్వ పోటీలు

తుమ్మపాల : అక్టోబర్ 2వ తేదీన మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లాస్థాయిలో 'గాంధీస్ గ్లోబల్ ఇంపాక్ట్', 'రిలవెన్స్ ఆఫ్ గాంధీయన్ థాట్ ఇన్ టుడేస్ వరల్డ్' అనే అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి జి.మహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 15న రేసపువానిపాలెంలోని ఆదిత్య బిజినెస్ స్కూల్, క్యూంబీ చర్చిలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 18–29 సంవత్సరాల మధ్య వయసు గల ఉత్సాహవంతులైన యువతీ యువకులు పాల్గొనవచ్చన్నారు. జిల్లాస్థాయిలో విజేతలను రాష్ట్రస్థాయి అభ్యర్థులుగా పరిగణిస్తామన్నారు. న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో అక్టోబర్ 2న ప్రధాని నరేంద్రమోడీ పాల్గొనే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనే అవకాశం వారికి కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

15న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. టెక్నోసాఫ్ట్ సొల్యూషన్స్, వోల్టా స్పేసెస్, ఏడీఎల్ ఆగ్రో పార్క్స్, శ్రీరామ్ ఫైనాన్స్, రిలయన్స్ జియో, వరుణ్ మోటర్స్, టీం లీజ్, యూనియన్ బ్యాంక్, రెడ్డీస్ లేబొరేటరీస్, బిగ్‌బాస్కెట్, సెవెన్ హిల్స్ హెల్త్ కేర్ తదితర కంపెనీల్లో 873 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. అసోసియేట్ ఏజెన్సీ, సూయింగ్ మిషన్ ఆపరేటర్, బిల్లింగ్, కస్టమర్ అండ్ ఫీల్డ్ ట్రైనీ, సేల్స్ డెవలప్‌మెంట్ మేనేజర్, ఫార్మసిస్ట్, అసెంబ్లీ ఆపరేటింగ్ కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, డెలివరీ ఎగ్జిక్యూటివ్స్, డ్యూటీ మెడికల్ ఆఫీసర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, టీం లీడర్స్, స్టాఫ్ నర్స్, ఇన్‌చార్జి నర్స్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్, పీజీ, ఐటీఐ, డిప్లమా, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న 18–35 ఏళ్ల పురుష, మహిళా అభ్యర్థులు https:// www.ncs.gov.in/లో పేర్లు నమోదు చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు.

జైళ్ల సంస్కరణలు భేష్

- ముగిసిన జైళ్ల శాఖ జాతీయ సదస్సు
- ఆరు అంశాలపై సుదీర్ఘంగా సాగిన చర్చ



పుస్తకం ఆవిష్కరిస్తున్న గవర్నర్



సిబ్బంది నుంచి వందనం స్వీకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

అరిలోవ: రుషికొండలోని సాయిప్రియ రిసార్ట్స్‌లో రెండు రోజులుగా జరుగుతున్న జైళ్ల శాఖ 8వ జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. సదస్సులో భాగంగా స్వాతంత్ర్యం రాకముందు దేశంలో జైళ్ల పరిస్థితి, పనితీరు.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ 76 ఏళ్లలో ఎలాంటి సంస్కరణలు జరిగాయి.. భవిష్యత్‌లో ఇంకెలాంటి సంస్కరణలు అమలు చేయాలి, ఏ విధంగా జైళ్లను ఆధునికీకరించాలి తదితర అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(బీపీఆర్‌డీ), రాష్ట్ర జైళ్ల శాఖ సంయుక్తంగా 'అమృత్ కాల్'పేరుతో నిర్వహించిన ఈ సదస్సును సోమవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా ప్రారంభించిన విషయం తెలిసిందే. ముగింపు కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనితతో కలిసి రాష్ట్ర జైళ్ల శాఖ ముద్రించిన బులిటెన్‌ను ఆవిష్కరించారు. బీపీఆర్‌డీ డీజీ బాలాజీ శ్రీ వాత్సవ్, ఏపీ డీజీ హరీష్ కుమార్ గుప్తా, ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని జైళ్ల శాఖ డీజీలు, ఐజీలు, కేంద్ర కారాగారాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఆరు అంశాలపై సుదీర్ఘ చర్చ

సదస్సులో భాగంగా జైళ్లలో సంస్కరణలు, సంక్షేమం, అభివృద్ధి, ఆధునికీకరణ, ఖైదీల్లో పరివర్తనం కలిగించడం, వారితో స్నేహంగా మెలగడం, కౌన్సెలింగ్ తదితర అంశాలపై ప్రధాన వక్తలు మాట్లాడారు. అనంతరం అధికారులతో గ్రూపులను ఏర్పాటు చేసి.. ఆయా రాష్ట్రాల జైళ్లలో అమలు చేస్తున్న సంస్కరణలు, సంక్షేమం అభివృద్ధిపై చర్చించారు. రెండు రోజుల సదస్సులో ప్రధానంగా ఆరు అంశాలపై చర్చ జరిగింది. టెక్నాలజీ ఇన్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్, స్టేటస్ ఆఫ్ మెంటల్ హెల్త్ ఇన్ ప్రిజన్స్ ఇన్ ఇండియా, మోడల్ ప్రిజన్స్ లెజిస్లేషన్, డీఅడిషన్ ఆఫ్ ప్రిజనర్స్, ఓవర్ ప్రిజన్స్, అల్టర్నేటివ్స్ టు ఇన్‌కార్సెరేషన్ అనే ఆరు అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. చర్చించిన అంశాలతో రాష్ట్ర జైళ్ల అధికారులు ఓ నివేదిక సిద్ధం చేసి, బీపీఆర్‌డీతో పాటు అన్ని రాష్ట్రాల జైళ్ల శాఖ అధికారులకు సమర్పిస్తారు.

సదస్సులో గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ దేశంలో జైళ్ల సంస్కరణలు బాగున్నాయన్నారు. సంస్కరణలు అమలు చేయడం, ఖైదీలకు ఆరోగ్యశ్రీ పథకం అమలు, జైళ్ల ఆధునికీకరణలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఖైదీలకు ప్రతీకారంతో కూడిన శిక్ష ఉండకూడదన్నారు. వారిలో పరివర్తనం తీసుకొచ్చేలా జైళ్ల శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర హోం మంత్రి వనిత మాట్లాడుతూ రాష్ట్రంలోని జైళ్లలో పటిష్టమైన భద్రత ఉందన్నారు. సంస్కరణలు అమలు చేయడంతో పాటు ఖైదీలు, సిబ్బంది కోసం అనేక సంక్షేమ చర్యలు చేపడుతున్నామన్నారు.

రూ.1.85 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



ఉగ్గినపాలెంలో హెల్త్ క్లినిక్ ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో ఒకేసారి రూ.కోటి 85 లక్షలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం మంగళవారం ఉత్సాహంగా సాగింది. స్థానిక ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానుల సమక్షంలో దాదాపు ఒకేచోట నిర్మించిన అభివృద్ధి పనులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతితో కలిసి ప్రారంభించారు. నూతనంగా రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.19.85 లక్షలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయం, రూ.24.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ.16 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్ర భవనాలు ప్రారంభించారు. అలాగే చెత్త నుంచి సహజ సిద్ధ ఎరువు తయారీకి రూ.20 లక్షలతో నిర్మించిన సంపద కేంద్రం, మంచినీటి కొరత నివారించడానికి రూ.19.40 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం, రూ.18.86 లక్షలతో ప్రాథమికోన్నత పాఠశాలలో చేపట్టిన నాడు–నేడు పనులు ప్రారంభించారు. రూ.22.20 లక్షలతో నిర్మించిన మురుగుకాలువలు, రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, రూ.3 లక్షలతో సామాజిక భవనం నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాథమికోన్నత పాఠశాలలో డిజిటల్ తరగతుల నిర్వహణ తీరును మంత్రి పరిశీలించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకొని బాగా చదివి భావి భారత పౌరులుగా ఎదగడానికి కృషి చేయాలని కోరారు. 19 స్వయం సహాయక సంఘాలకు రూ.కోటి 90 లక్షల శ్రీనిధి బ్యాంకు లింకేజి రుణాల మంజూరు చెక్ అందజేశారు. జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కె. విష్ణుమూర్తి, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హేమంత్, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు గాలి నాగేశ్వరరావు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి జేకేసీ వాయిదా

తుమ్మపాల: ఈనెల 13న బుధవారం రావికమతంలో నిర్వహించాల్సిన మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం వాయిదా పడినట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై బుధవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించనున్న వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పాల్గొనాల్సి ఉందన్నారు. అందువల్ల రావికమతంలో నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసినట్టు ఆయన పేర్కొన్నారు.

ఇంటి దొంగే సూత్రధారి

నిర్మానుష్యమైన ప్రదేశాన్ని ఎంచుకున్నారు.. సీసీ కెమెరాలు లేని చోట రంగం సిద్ధం చేశారు.. బ్యాంకు నుంచి పెన్షన్ సొమ్ము తీసుకువస్తున్న ఇద్దరు సచివాలయ ఉద్యోగుల కళ్లలో కారం కొట్టి లక్షల సొమ్ము దోచుకుపోయారు. ఇద్దరు ఉద్యోగుల్లో ఒకరు ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారి కాగా పోలీసులు చాకచక్యంగా ఈ కేసును ఛేదించారు. చైన్ స్నాచింగ్‌లో తలపండిన పాత నేరస్తుడు మరొకరితో కలిసి మూడు సంఘటనల్లో మహిళల మెడలో బంగారు వస్తువులను లాక్కొని పోయాడు. ఈ గొలుసు దొంగలను కూడా పట్టుకొని, పోలీసులు వారి వద్ద లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అనకాపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ కేసుల వివరాలను వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న నగదు, ఆభరణాలు

- పింఛన్ సొమ్ము దోపిడీలో డిజిటల్ అసిస్టెంట్‌దే కీలక పాత్ర
- ఇద్దరు స్నేహితులతో కలిసి చోరీకి ప్లాన్
- బాధితుడిగా నటిస్తూ.. అంతా తానై కథ నడిపిన వైనం
- చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులు



కేసులను ఛేదించిన పోలీసు అధికారులతో ఎస్పీ మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: గత నెల 31న నక్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు సచివాలయ ఉద్యోగులు బ్యాంక్ నుంచి పింఛను డబ్బులు డ్రా చేసి తీసుకొస్తుండగా ఇద్దరు బైక్‌పై వచ్చి దోచుకుపోయిన విషయం గుర్తుండే ఉంటుంది. తమ వద్ద ఉన్న రూ.13.78 లక్షల నగదు దొంగిలించుకుపోయారని జానకయ్యపేట సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఇంటి దొంగే ప్రధాన సూత్రధారని నిర్ధారించారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌తోపాటు సొమ్ము తీసుకువస్తున్న డిజిటల్ అసిస్టెంట్ ఆలంగి నానిబాబే అసలు దొంగని దర్యాప్తులో తేల్చారు. ఎస్పీ మురళీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలంగి నానిబాబు నక్కపల్లి మండలం జానకయ్యపేట సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. నానిబాబుకు సహ నిందితులు దేవిరెడ్డి సాయికుమార్, చందక సాయి చిన్ననాటి స్నేహితులు. పింఛన్ సొమ్ము తేవడానికి తాను కూడా వెళతానని, తన సహాయంతో సునాయాసంగా నగదు దొంగిలించవచ్చని మిత్రులతో కలిసి నానిబాబు దోపిడీకి పథకం వేశాడు. వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, తాను బ్యాంకు వద్ద ఎన్ని గంటలకు బయలుదేరారు, తాము ఎంచుకున్న ప్రదేశానికి ఎంత సేపట్లో వస్తారు.. తదితర సమాచారాన్ని నానిబాబు ఎప్పటికప్పుడు సహచరులకు చేరవేశాడు. దారి కాచిన దేవిరెడ్డి సాయికుమార్, చందక సాయి కళ్లలో కారం కొట్టి డబ్బుల బ్యాగ్ లాక్కొని కోటవురట్ల వైపు స్పీడ్‌గా వెళ్లిపోయారు. తనకు ఏమీ తెలియనట్లు నానిబాబు నటించాడు. వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి విచారించారు. తొలుత ఇద్దరు సచివాలయ ఉద్యోగులను అనుమానించిన పోలీసులు వారిపై నిఘా పెట్టారు. నానిబాబు తీరు వారిని ఆలోచింపజేసింది. బ్యాంకు నుంచి సంఘటన స్థలం వరకు మధ్యలో ఉన్న మొత్తం 25 సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు నిందితులను కనిపెట్టారు. సంఘటన జరగడానికి ముందు నానిబాబు స్నేహితులు బైక్‌పై అనుమానాస్పదంగా చక్కర్లు కొట్టడం రికార్డయింది. నానిబాబు తన ఇన్‌స్టాగ్రామ్ ఐడీ నుంచి సాయికుమార్ ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఐడీకీ తమ రూట్ గురించి మెసేజ్ పెట్టినట్టు కనిపెట్టారు. దీంతో నానిబాబుకు సహ నిందితులకు ఉన్న స్నేహం నిర్ధారణ అయింది. మంగళవారం ముగ్గురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద రూ.12,92,000 నగదు, పల్సర్ బైక్, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఎస్పీ అభినందనలు

తక్కువ వ్యవధిలో స్నాచింగ్, దోపిడీ కేసులను పరిష్కరించిన అడిషనల్ ఎస్పీ అదిరాజ్ రాణా, నర్సీపట్నం సీఐ రమణయ్య, నక్కపల్లి సీఐ అప్పన్న, బుచ్చియ్యపేట సీఐ కుమార్‌స్వామి, నాతవరం ఎస్సై పి.రామకృష్ణ, నర్సీపట్నం రూరల్ ఎస్సై ఎం.నారాయణరావు, గొలుగొండ ఎస్సై జి.నారాయణరావు, నక్కపల్లి ఎస్సై శిరీష, కోటవురట్ల ఎస్సై, కానిస్టేబుళ్లు ఆర్.రమణ, సీహెచ్ చిన గంగరాజు, ఎస్.శ్రీనులను ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎఎస్పీలు విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, ఎస్‌బీ సీఐలు చంద్రశేఖర్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్యకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

చైన్ స్నాచింగ్ కేసుల్లో ఇద్దరు అరెస్ట్

- భారీగా చోరీ సొత్తు రికవరీ

నర్సీపట్నం రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలో జరిగిన మూడు చైన్ స్నాచింగ్ కేసుల సూత్రధారిని, అతనికి సహకరించిన మరొకరిని అరెస్ట్ చేసి పోలీసులు రిమాండ్‌కి తరలించారు. ఈనెల 5న నాతవరం పోలీస్‌స్టేషన్ పరిధి గన్నవరం గ్రామంలో లగుడు రమణమ్మ ఒంటరిగా చేనుకు వెళుతుండగా ఆమె మెడలో పుస్తెలతాడును బొత్స వీరబాబు (కాకినాడ జిల్లా బిళ్లనందూరు గ్రామం), అల్లు నూకరాజు(కోటవురట్ల మండలం ఆక్సాహేబ్‌పేట) దొంగిలించుకుపోయారు. జూన్ 30న నర్సీపట్నం రూరల్ పరిధి వేములపూడిలో రెండున్నర తులాల పుస్తెలతాడు, నల్లపూసల తాడు, రెండు జతల చెవిదుద్దులను దొంగతనం చేశారు. ఈనెల 4న కోటవురట్ల మండలం చౌడువాడ గ్రామంలో మూడున్నర తులాల పుస్తెలతాడును లాక్కొనిపోయారు. బొత్స వీరబాబుపై 40 దొంగతనం కేసులున్నాయి. జల్సాలకు అలవాటై.. చోరీలకు పాల్పడుతుంటాడు. నిందితుల నుంచి రూ.4 లక్షల విలువైన ఎనిమిదిన్నర తులాల బంగారు ఆభరణాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆనంద 'తాండవ'ం

- నిర్వాసితులకు తీరనున్న భూమి కష్టాలు
- సీఎం నిర్ణయంతో డీ ఫారం పట్టా రైతుల్లో ఆనందం



గాంధీనగరంలో జిరాయితీగా మారనున్న డీ ఫారం పట్టా భూమి



డీ ఫారం పట్టా భూముల సమస్యను బాధితులతో చర్చిస్తున్న నాటి కలెక్టర్ వినయ్‌చంద్

నాతవరం: తాండవ నిర్వాసితులు గ్రామాలైన గాంధీనగరం, మాధవనగరం పంచాయతీల్లో రైతుల భూకష్టాలు తీరనున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 20 ఏళ్లు దాటిన డీ ఫారం పట్టా భూములను జిరాయితీగా మార్పు చేయాలని తీసుకున్న నిర్ణయంతో ఏళ్లనాటి సమస్యకు మోక్షం కలగనుంది. తాండవ రిజర్వాయర్ నిర్మాణ సమయంలో ప్రాజెక్టు లోపల ఉన్న 15 గ్రామాలను ప్రభుత్వం అప్పట్లో ఖాళీ చేయించి వారి భూములు సేకరించింది. ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వం వేరే చోట ఇళ్లు నిర్మించి, భూములు ఇచ్చింది. 1973, 1974 సంవత్సరాల్లో రెండు విడతలుగా రైతులకు డీ ఫారం పట్టాలు ఇచ్చారు.

గాంధీనగరంలో సుమారు 400 మందికి, మాధవగరం, గంటావారి కొత్తగూడెం గ్రామాల్లో సుమారు 500మందికి ఈ పట్టాలు ఇచ్చారు. ఆ భూముల్లో సాగు చేసుకుంటూ తాండవ నిర్వాసిత రైతులు జీవనం సాగిస్తున్నారు. డీ ఫారం పట్టా భూములు కావడంతో రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేదు. రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో క్రయవిక్రయాలు సైతం జరగడం లేదు. దీంతో ఏ అవసరానికైనా బ్యాంకు నుంచి అప్పు తెచ్చుకోవడానికి వీలు లేక నిర్వాసిత రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. డీ ఫారం పట్టా ఉన్నా ఆన్‌లైన్‌లో భూమి నమోదు కాలేదు. వైఎస్సార్ రైతు భరోసా పథకంలో ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సాయం వారికి రావడం లేదు. ప్రభుత్వం ఇచ్చే రాయితీ విత్తనాలు సైతం తాండవ నిర్వాసిత రైతులకు అందటం లేదు. 2019లో అప్పటి కలెక్టర్ వినయ్‌చంద్, జాయింట్ కలెక్టర్ వేణుగోపాలరెడ్డి దృష్టికి రైతులు తీసుకెళ్లడంతో మాధవగరం గ్రామానికి 200 బస్తాల వరి విత్తనాలు అందించారు.


తమను ఆదుకోవాలని రెండు పంచాయతీ గ్రామాల నిర్వాసిత రైతులు కలెక్టర్లు, ప్రజాప్రతినిధులకు అనేకసార్లు వినతులు ఇచ్చారు. తాండవ ప్రాజెక్టుతో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం అయినా నిర్వాసితులకు మాత్రం కష్టాలే మిగిలాయి. తాత్కాలిక లబ్ధే గానీ దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరలేదు.

దీనినొక ఆస్తిగా పరిగణించే అవకాశం లేదు. ఎందుకంటే ఇక్కడ భూమి రేట్లు పెరగవు. భూమి ఉన్నా లేనట్టుగానే భావించేవారు.

ప్రభుత్వ ప్రకటనతో పెరిగిన రేట్లు

డీ ఫారం పట్టా భూములను జిరాయితీ భూములు గా మార్పు చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో గాంధీనగరంలో ఎకరం భూమి విలువ కోటి రూపాయలు పలుకుతోంది. గాంధీనగరం గ్రామం భూములు నర్సీపట్నం-తుని రోడ్డును అనుకొని ఉన్నాయి. ఇంతవరకు ఇక్కడ ఎకరానికి 3 లక్షలు కూడా ఇచ్చేందుకు ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు రికార్డులు మార్పు చేయకముందే భూముల కొనుగోలుకు వ్యాపారులు పోటీ పడుతున్నారు.


రుణపడి ఉంటాం



మా భూములను జిరాయితీ భూములుగా మార్పు చేసేందుకు తీసుకున్న నిర్ణయంతో ఊహించని ఆనందంతో ఉన్నాం. భూములున్న రైతులంతా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. బతికున్నంత కాలం సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరిచిపోలేం.

–పాతాళ అప్పారావు, సర్పంచ్, గాంధీనగరం


కష్టాలు తీరుతాయి



కష్టాలు తీరుతాయని ఆశతో ఉన్నాం. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తాండవ నిర్వాసిత రైతులను పలుమార్లు నర్సీపట్నం ఆర్డీవో వద్దకు తీసుకెళ్లారు, ఇప్పుడు ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయంతో మా భూములు జిరాయితీ అవుతాయని ఆశిస్తున్నాం.

–సామల చింతల్లి, సర్పంచ్ మాధవనగరం

అందరికీ న్యాయం చేస్తాం



ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న డీ ఫారం పట్టా భూములను జిరాయితీగా మార్పు చేస్తాం. దీనికి సంబంధించి ప్రభుత్వం ఆదేశాలను తహసీల్దార్లకు పంపించాం. కలెక్టర్ ఆదేశాలను అనుసరించి ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా చేస్తాం.

–హెచ్.వి.జయరామ్, ఆర్డీవో, నర్సీపట్నం

1/70 యాక్టు కలెక్టర్ పరిధిలో ఉంది

మైదాన ప్రాంతంలో ఉన్న భూములకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. మాధవనగరం గ్రామం 1/70 యాక్టు పరిధిలో ఉంది. ఇక్కడ గిరిజనులకు ఎలాంటి సమస్య ఉండదు. గిరిజనేతరుల భూములు జిరాయితీ చేయాలంటే మాత్రం కలెక్టర్ అనుమతి ఉండాలి. గాంధీనగరంలో ఉన్న డీ ఫారం పట్టా భూములకు జిరాయితీ చేసేస్తాం. ఏ సమస్య లేదు.

–ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు, తహసీల్దార్, నాతవరం

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే ఆనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా
డాక్టర్ హిమశేఖర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్
సత్తెమ్మతల్లి ఆలయం రోడ్డు, గవరపాలెం, అనకాపల్లి
తేదీ : 16-09-2023
సమయం : ఉ. 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు :
90101 06665, 70757 09205

క్లుప్తంగా

నేడు మీడియా వర్క్ షాప్

తుమ్మపాల: పట్టణంలో రింగ్‌రోడ్డు వద్ద గల సన్ కేజిల్ హోటల్‌లో బుధవారం విలేకరులకు 'వార్తా లాప్' మీడియా వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) మీడియా కమ్యూనికేషన్స్ అధికారి టి.హెన్రీరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, ఎంపీ బి.వి.సత్యవతి, ఎస్పీ మురళీకృష్ణ పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులందరూ ఈ వర్క్‌షాప్‌కు హాజరుకావాలని ఆయన కోరారు.

దంతేవాడ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: భద్రతా కారణాల వల్ల కొత్తవలస-కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదించడంతోపాటు దంతేవాడ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం- కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం- కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ ఈ నెల 19వ తేదీ వరకు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రైలు ఈ నెల 20వ తేదీ వరకు దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

కొల్లాం రైలుకు డివైన్ నగర్‌లో తాత్కాలిక హాల్ట్

విశాఖపట్నం-కొల్లాం-విశాఖపట్నం వీక్లీ రైలుకు ఆయా తేదీల నుంచి డివైన్ నగర్‌లో ఒక నిమిషం తాత్కాలిక హాల్ట్‌ను కల్పిస్తున్నట్లు త్రిపాఠి తెలిపారు. అక్టోబరు 12వ తేదీ నుంచి విశాఖపట్నం-కొల్లాం (18567) వీక్లీ స్పెషల్ రైలు డివైన్ నగర్‌లో ఆగుతుంది. ఈ రైలు మరుసటిరోజు ఉదయం 8.15 గంటలకు డివైన్ నగర్ చేరుకుని, అక్కడ నుంచి 8.16గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో అక్టోబరు 20వ తేదీ నుంచి కొల్లాం-విశాఖపట్నం (18568) ఎక్స్‌ప్రెస్‌కు డివైన్ నగర్‌లో హాల్ట్ కల్పించారు. ఈ రైలు అదే రోజు రాత్రి 11.45 గంటలకు డివైన్ నగర్ చేరుకుని, అక్కడ నుంచి 11.46 గంలకు బయల్దేరుతుంది.

మర్యాదతో మరింత ఆదరణ

- డ్రైవర్లు, కండక్టర్లకు నిపుణులతో కౌన్సెలింగ్
- వారంలో ఒక రోజు జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో నిర్వహణ
- ఫిర్యాదుల నేపథ్యంలో ఆర్టీసీ ఉన్నతాధికారుల చర్యలు



కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిప్యూటీ సీటీఎం అప్పలనాయుడు

సాక్షి, విశాఖపట్నం: ప్రయాణికుల పట్ల సిబ్బంది మర్యాదగా వ్యవహరించడంపై ఆర్టీసీ అధికారులు ఫోకస్ పెడుతున్నారు. పాసింజర్ల మన్ననలు పొందడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి పట్ల కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఏకవచనంతో సంబోధిస్తున్నారని, బస్సులు సక్రమంగా ఆపడం లేదని, దురుసుగా సమాధానం చెబుతున్నారని.. ఇలా పలు ఫిర్యాదులు ఆర్టీసీ కంప్లయింట్ సెల్‌కు అందుతున్నాయి. ఈ ఫిర్యాదులను ఆర్టీసీ యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా మెలిగేలా చర్యలు చేపట్టింది.

ఇందుకోసం కంప్లెయింట్ సెల్‌కు అందిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత కండక్టర్లు, డ్రైవర్లకు ప్రతి మంగళవారం కౌన్సెలింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. ఆర్టీసీ జోన్-1కు సంబంధించి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఈ కండక్టర్లు, డ్రైవర్లకు విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ ప్రక్రియకు మంగళవారం నుంచే శ్రీకారం చుట్టారు. ఉదయం రెండు గంటలు, మధ్యాహ్నం రెండు గంటల చొప్పున ఆర్టీసీలో ఎంపిక చేసిన అధికారులతో పాటు బయట నుంచి నిపుణులు, లెక్చరర్లు, అడ్వకేట్లను కూడా రప్పించి వారితో సుహృద్భావ వాతావరణంలో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని, వారు అడిగిన ప్రశ్నలు, సందేహాలకు దురుసుగా కాకుండా సామరస్యంగా సమాధానం చెప్పాలని, చిరాకు ప్రదర్శించకుండా మాట తీరు గౌరవప్రదంగా ఉండాలని, వారిని ఏకవచనంతో సంబోధించవద్దని, ప్రయాణికుల మన్ననలు పొందాలని సూచిస్తున్నారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా వీరి ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్ల వ్యవహారశైలి ప్రయాణికులపై ప్రభావం చూపుతుందన్న భావనకు అధికార్లు వచ్చారు. కౌన్సెలింగ్ ద్వారా వీరు ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలిగితే ఆర్టీసీపై ప్రయాణికుల ఆదరణ మరింత పెరుగుతుందని, ప్రైవేటు ఆపరేటర్ల వైపు మళ్లే అవకాశం ఉండదని వీరు భావిస్తున్నారు.

నిరంతరం కొనసాగిస్తాం...



ప్రయాణికులతో కండక్టర్లు, డ్రైవర్లు మర్యాదగా వ్యవహరించడం వల్ల ఆర్టీసీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుంది. దీంతో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో పెరిగి ఆర్టీసీ ఆదాయం వృద్ధి చెందడానికి కూడా దోహదపడుతుంది. కంప్లయింట్ సెల్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత సిబ్బందికి బ్యాచ్‌కు 10-15 మంది చొప్పున ఎంపిక చేసి నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. దీనిని నిరంతరం కొనసాగిస్తాం.

– సి.రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జోన్-1

ఇంటర్‌తో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం..!

- డీవీఈవో సుజాత
- హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాంపై కళాశాలలో అవగాహన



కళాశాలల ప్రిన్సిపాళ్లకు హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాం గురించి వివరిస్తున్న సంస్థ ప్రతినిధులు

అనకాపల్లి రూరల్ : నేటి యువత ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలే లక్ష్యంగా విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు కేవలం ఇంటర్మీడియట్ అర్హతతోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పొందేలా రాష్ట్ర ప్రభుత్వం అద్భుత అవకాశం కల్పించేందుకు కార్యాచరణ రూపొందించింది. భారతదేశపు అతిపెద్ద ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్‌తో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంచి ఉద్యోగావకాశాలను అందిస్తోంది ప్రభుత్వం. హెచ్‌సీఎల్ టెక్ బీ పేరుతో అమలు చేస్తున్న ఈ అసాధారణ కార్యక్రమంపై విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఇందులో భాగంగా మంగళవారం అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాలలో జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధులు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశాన్ని జిల్లా వృత్తి విద్యాధికారిణి బి. సుజాత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఇలాంటి మంచి అవకాశంపై విద్యార్థులందరికీ కళాశాలల ప్రిన్సిపాళ్లు వివరించి అవగాహన కల్పించాలన్నారు. చిన్న వయసులోనే సాఫ్ట్‌వేర్ కొలువులతోపాటుగా ఉన్నత విద్య చదువుకునే వీలుంటుందన్నారు. దీనిని విద్యార్థులంతా సద్వినియోగపర్చుకునేలా చూడాలని ప్రిన్సిపాళ్లను ఆమె కోరారు. హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాం గురించి సంస్థ రాష్ట్ర మేనేజర్ అనిల్, ఉత్తరాంధ్ర క్లస్టర్ మేనేజర్ యుగేష్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. 2023, 2024 సవత్సరాల్లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు హెచ్‌సీఎల్ ఎర్లీ కెరీర్ ప్రోగ్రాంకు అర్హులని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఎంపిక ప్రక్రియ ఉంటుంది. తొలుత నిర్వహించే ఆన్‌లైన్‌లో పరీక్షలో ఎంపికైన వారికి హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఎంపికైన విద్యార్థులు హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాంలో చేరడానికి ఆఫర్ లెటర్ పొందుతారని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆ తర్వాత ఏడాది కాలపరిమితితో టెక్ బీ ట్రైనింగ్ ఉంటుంది. విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరుల్లో హెచ్‌సీఎల్ క్యాంపస్‌లకు వెళ్లి ఒక నెల శిక్షణ తీసుకోవాలి. అనంతరం మరో ఐదు నెలలు ఇంటి వద్ద నుంచే ఆన్‌లైన్ శిక్షణ పొందవచ్చు. ఇందుకోసం అభ్యర్థులకు ల్యాప్ ట్యాప్‌తో పాటు ఇంటర్‌నెట్ ఛార్జీలు సంస్థ ఇస్తుంది. అనంతరం ప్రారంభంలోనే రూ.10 వేల స్టైఫండు ఆరు నెలలు చెల్లిస్తారు. తర్వాత ప్రతిభ ఆధారంగా సాఫ్ట్‌వేర్‌తో పాటు ఇతర రంగాల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని వారు తెలిపారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాల కోసం తమ సంస్థ దేశంలో ప్రముఖ విశ్వవిద్యాలయాలు, ఐఐటీ, ఐఐఎంలతో ఒప్పందం కుదుర్చుకుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపాల్ జయబాబు, జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాశాలల ప్రిన్సిపాళ్ల పాల్గొన్నారు.

జైల్లోనే చంద్రబాబుకు పూర్తి రక్షణ

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



చోడవరం : రాజమండ్రి సెంట్రల్ జైలులోనే చంద్రబాబునాయుడుకు పూర్తిగా సౌకర్యంగా, రక్షణగా ఉంటుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం చోడవరంలో తన కార్యాలయంలో ధర్మశ్రీ మాట్లాడారు. చంద్రబాబుకు హోమ్ అరెస్టుకు న్యాయస్థానం నిరాకరించడంతో న్యాయానికే న్యాయం జరిగిందని ధర్మశ్రీ అన్నారు. చట్టంలో లేని డిమాండ్లు చేయడమే కాకుండా వ్యవస్థలను మేనేజ్ చేయడానికి చంద్రబాబు ఎంతటికైనా ఒత్తిడి తెస్తారన్నారు. బయట ఉంటే సాక్షులను కూడా బెదిరించే అవకాశం ఉందని, అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేసిన రాజమండ్రి సెంట్రల్ జైలులోనే ఆయనకు ఎంతో సౌకర్యంగా ఉందని ధర్మశ్రీ అన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని రాష్ట్ర ప్రజల సొమ్మును వివిధ శాఖల ద్వారా రూ.వేలాది కోట్లు కైంకర్యం చేసిన చంద్రబాబు మరిన్ని కేసుల్లో జైలుకెళ్లక తప్పదన్నారు. ప్రస్తుతం నడుస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో హవాలా కుంభకోణంతో పాటు కార్మిక కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఈఎస్ఐ కుంభకోణం, విజయవాడ రింగ్ రోడ్డులో జరిగిన కుంభకోణాలకు పాల్పడిన చంద్రబాబు త్వరలో మరిన్ని కేసుల్లో జైలు కెళ్లక తప్పదని ధర్మశ్రీ అన్నారు. 40 యేళ్ల ప్రజలను మభ్యపెట్టి, వ్యవస్థలను మేనేజ్ చేస్తూ ఇప్పటి వరకూ అనేక కుంభకోణాలు చేసినా తప్పించుకు తిరిగిన చంద్రబాబుకి దేవుడు శిక్ష వేసే రోజులు వచ్చాయన్నారు. కుంభకోణాలన్నీ చేసిన ఆధారాలతో దొరికిపోయిన టీడీపీ ఈ ప్రక్రియలో ఏ సంబంధంలేని వైఎస్సార్‌సీపీపై ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. తప్పుడు కేసులు, అరెస్టు చేయాల్సిన అవసరం వైఎస్సార్‌సీపీకి లేదని, తప్పు చేస్తే దర్యాప్తు సంస్థలు, న్యాయవ్యవస్థ చర్యలు తీసుకుంటాయని ధర్మశ్రీ అన్నారు.

ఏఎంసీలో వైద్యులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమాన్ని ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కళాశాలలో రీజినల్ సెంటర్ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీస్(ఆర్‌సీఎంఈటీ) ఆధ్వర్యంలో వైద్యులకు మంగళవారం మూడు రోజుల శిక్షణ ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, చత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి 30 మంది వైద్యులు శిక్షణలో పాల్గొన్నారు. నిర్వాహక కన్వీనర్ డాక్టర్ పి.జె.శ్రీనివాస్, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

అమెరికాలో వేంకటేశ్వర శతకం పుస్తకావిష్కరణ



అమెరికాలో వేంకటేశ్వర శతక పుస్తకావిష్కరణ చేస్తున్న శిష్టా తమ్మిరాజు

అనకాపల్లిటౌన్ : అనకాపల్లికి చెందిన ప్రముఖ కవి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శిష్టా తమ్మిరాజు రచించిన దాస తమ్మిరాజులు దండ మిదియె అను వేంకటేశ్వర స్వామివారి శతక కావ్యం అమెరికా ఫ్లోరిడా రాజధాని తలహస్సీ నగరంలో ఈనెల 10న ఆవిష్కరించారు. ప్రముఖకవి, సంగీత దర్శకుడు శ్రీనివాస భరద్వాజ్ కిశోర్ చేతుల మీదుగా పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ శతకకర్త అద్భుతమైన చక్కని పద్యాలు రచించడమే కాకుండా ఈ నగరంలో నూతనంగా నిర్మింపబడిన వేంకటేశ్వరస్వామి వారికి అంకితమివ్వడంతో ఇక్కడ నివసిస్తున్న తెలుగువారంతా ఎంతో ఆనందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రముఖ గాయని నోరి రాధిక మాట్లాడుతూ తన చక్కని గానంతో పద్యాలు వీనులవిందుగా ఆలపించగా ప్రముఖ పండితురాలు డా.సుమన ఆ పద్యాలను సమీక్ష చేస్తూ పద్యాలు సరళంగా సుభోదకంగా ఉన్నాయని ప్రశంసించారు. పద్యకవి జానపద రవి మాట్లాడుతూ ఇది ప్రతి ఇంట భక్తి భావాన్ని కురిపించే పుస్తకమన్నారు.

పాము కాటుకు రైతు మృతి



అప్పలనాయుడు మృతదేహం (ఇన్‌సెట్) అప్పలనాయుడు(ఫైల్)

రాంబిల్లి : కట్టుబోలు గ్రామానికి చెందిన రైతు పాము కాటుకు మృతి చెందాడు. మంగళవారం తెల్లవారు జామున జల్లా అప్పలనాయుడు(61) ఇంటి నుంచి మురకాడ సమీపంలో వున్న పొలంలోకి వెళ్తుండగా పాము కాటు వేసింది. యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. రైతుగా, కూలీగా , భవన నిర్మాణ కార్మికుడిగా, కళాకారుడిగా గ్రామంలో అప్పలనాయుడుకు మంచి పేరుంది. అప్పలనాయుడుడు మృతితో ఆయా కుటుంబంతో పాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ దీనబంధు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అప్పలనాయుడుకు భార్య గణేషమ్మ, కుమారులు సాయి, భాను ఉన్నారు.

ఆ ఓటరు వయసు 223 ఏళ్లు..!

- తప్పుల తడకగా ఓటరు గుర్తింపు కార్డులు
- 1800వ సంవత్సరంలో పుట్టినట్టు కార్డులో నమోదు



పుట్టిన తేదీ తప్పుగా నమోదు చేసిన ఓటరు కార్డు

అగనంపూడి: భారత ఎన్నికల కమిషన్ జారీ చేస్తున్న ఓటరు గుర్తింపు కార్డులు తప్పుల తడకలుగా దర్శనమిస్తున్నాయి. అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలసకు చెందిన పట్టా రమణ పేరుతో జారీ అయిన కార్డులో ఆయన పుట్టిన తేదీ 01.01.1800 గా కార్డులో నమోదైంది. అంటే ఆయన వయసు ప్రస్తుతం 223 ఏళ్లు. ఇంత గుడ్డిగా కార్డులు మంజూరు చేస్తుండడం వల్లే ఒక వ్యక్తి పేరుతో పలు చిరునామాల్లో ఓటరుగా నమోదు అవుతుండడం, దొంగ ఓట్లు, బినామీ ఓట్లు పుట్టుకొస్తున్నాయి. ఇప్పటికైనా ఎన్నికల సంఘం స్పష్టమైన విధానం అమలు చేయాలని కోరుతున్నారు.

అక్టోబర్ 23లోగా రైతులకు కన్వేయన్స్ డీడ్‌లు జారీ

మహారాణిపేట (విశాఖ): నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా భూసమీకరణ(ఎల్‌పీఎస్) కింద భూములిచ్చిన రైతులకు అక్టోబర్ 23వ తేదీలోగా కన్వేయన్స్ డీడ్‌ల జారీ చేసేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వం 2020లో భూ సేకరణ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో డి.పట్టాదారులు, ప్రభుత్వ భూములను ఆక్రమించిన అర్హులైన రైతులు సుమారు 4,900 ఎకరాలను స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అందజేసినట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. అయితే కొంత మంది ప్రైవేటు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించి స్టే పొందారు. 2022లో హైకోర్టు ఈ కేసులను కొట్టి వేయడంతో ఆ భూముల్లో లే అవుట్లను అభివృద్ధి చేయడానికి టెండర్లు ఖరారు చేశారు. కాగా.. భూములిచ్చిన రైతులకు వారికి నచ్చిన, కోరుకున్న లే అవుట్‌లో ల్యాండ్ పూలింగ్ ఓనర్‌షిప్ సర్టిఫికెట్‌లను సంబంధిత కాంపిటెంట్ అథారిటీ ద్వారా మంజూరు చేశామని కలెక్టర్ వివరించారు. భూములిచ్చిన రైతులకు అభివృద్ధి పరిచిన ప్లాట్లను అందజేయడానికి.. 1,215 ఎకరాల్లో లేఅవుట్లను రూ.600 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ లే అవుట్లలో రోడ్లు, కాలువలు, తాగునీరు విద్యుత్, ఇతర మౌలిక వసతులను వచ్చే జనవరి నాటికి పూర్తి చేసేందుకు నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్లాట్లలో ఇల్లు నిర్మాణం, వారసులకు బదలాయింపు, రుణాల కోసం తనఖా, అమ్ముకోవడానికి పూర్తి హక్కులు ఉంటాయన్నారు.

వాతావరణంలో మార్పులపై అవగాహన

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పట్టణ వాతావరణంలో కలిగే మార్పులపై అవగాహన సదస్సు జరిగింది. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సూచనల మేరకు జీవీఎంసీ, ఎస్‌ఆర్‌యూ, ఎన్‌వీపీ సంయుక్తంగా సమావేశం నిర్వహించాయి. వాతావరణ ప్రభావాలు ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలను విపత్తుల నుంచి సురక్షితంగా ఉంచడమే ఈ సమావేశ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ప్రాథమిక దశ నుంచే వాతావరణ ప్రభావంపై విద్యార్థులకు బోధించడం, సముద్ర తీర ప్రాంతంలోని మత్స్యకారులు, నగర ప్రజలకు అవగాహన కల్పించాలని తీర్మానించారు.

వలకు చిక్కిన సీ హార్స్!



మత్స్యకారులకు దొరికిన సీ హార్స్

సాక్షి, విశాఖపట్నం: అత్యంత అరుదైన సీ హార్స్ మత్స్యకారుల వలలకు చిక్కుతున్నాయి. విశాఖ తీరంలో అప్పుడప్పుడు ఇవి దర్శనమిస్తున్నాయి. ఇవి రెండు మూడు అంగుళాల సైజులో రొయ్యలను పోలి ఉంటాయి. ఇవి రొయ్యల్లో కలిసిపోతుండడం వల్ల మత్స్యకారులు వీటిని పెద్దగా పట్టించుకోరు. తాజాగా మంగళవారం విశాఖ మత్స్యకారుల వలకు ఇవి దొరికాయి. నగరంలోని ఒక వ్యక్తి సాయంత్రం హార్బర్‌లో రొయ్యలను కొనుగోలు చేశాడు. ఇంటికి తెచ్చి చూడగా రొయ్యలతో పాటు ఈ సీ హార్స్ కూడా అందులో ఉన్నట్టు కె.విజయ్‌కుమార్ అనే వ్యక్తి గుర్తించారు. దొరికిన సీ హార్స్‌ను తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టడంతో ఈ విషయం బయట పడింది. కాగా సముద్ర గుర్రంగా పిలిచే ఈ చిన్న చేపలు (సీ హార్స్) ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణమండల, సమశీతోష్ణ జలాల్లో కనిపిస్తాయి. వీటికి వంకర మెడలు, పొడవైన గొంతు, తల, శరీరం నిటారుగా ఉండి తోక వంకరగా ఉంటుంది. ఈ జంతువులకు నోట్లో పళ్లుండవు. పగడపు దిబ్బలు, మడ అడవులు వంటి ప్రాంతాల్లో నివశిస్తాయి. నిట్టనిలువుగా నిలిచి ఈదుతాయి. మగ సముద్రపు గుర్రాలు తమ శరీరం ముందు భాగంలో సంతానాన్ని పొదగడానికి అనువైన ఒక సంచి వంటి అరను కలిగి ఉంటాయి. జతకట్టే సమయంలో ఆడ చేప గుడ్లను ఈ మగ చేప సంచిలోకి విడుస్తుంది. అప్పుడు మగ చేప వాటిని అంతర్గతంగా ఫలదీకరణ చేసి పిల్లలు గుడ్లలో నుంచి బయటకు వచ్చాక వాటిని నీటిలోకి విడుదల చేస్తుందని మత్స్యశాఖ జిల్లా అధికారి జి.విజయ 'సాక్షి'కి చెప్పారు. విశాఖ ప్రాంత సముద్ర జలాల్లో సీ హార్స్‌ల ఉనికి అరుదు అని తెలిపారు.

ప్రత్యామ్నాయ నీటి లభ్యతపై దృష్టి సారించాలి

సీఐఐ ఛైర్మన్ పీపీ లాల్‌కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐఐ చైర్మన్ లాల్ కృష్ణ

తాటిచెట్లపాలెం : పరిశ్రమలు నీటి సామర్థ్యాన్ని పెంపొందించుకోడానికి తమ అంతర్గత విధానాలు, పద్ధతులను మెరుగుపరుచుకోవాలని సీఐఐ ఛైర్మన్ పీపీ లాల్ కృష్ణ తెలిపారు. ప్రాంతీయ నీటి వనరుల లభ్యత, వాటి సరఫరా అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్నారు. సుస్థిరమైన అభివృద్ధి కోసం నీటి వినియోగ సామర్థ్యంపై సీఐఐ ఆధ్వర్యంలో మర్రిపాలెంలోని మారియట్ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక వ్యవస్థ పారిశ్రామికీకరణకు లోనవుతున్నందున, నీటి అవసరం పెరుగుతోందన్నారు. వివిధ ప్రక్రియల నుంచి ఉత్పన్నమయ్యే మురుగునీటిని తిరిగి ఉపయోగించడం, రీసైక్లింగ్ చేయడం, ఈ నీటిని ద్వితీయ పారిశ్రామిక కార్యకలాపాలకు వినియోగిస్తే నీటి కొరత తీరుతుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే భారతీయ పరిశ్రమల్లో నీటి వినియోగం చాలా తక్కువగా ఉందన్నారు. సీఐఐ వాటర్ ఇన్‌స్టిట్యూట్ కౌన్సెలర్ అదితి హస్కర్ మాట్లాడుతూ భారతీయ పరిశ్రమల్లో నీటి కొరత తీవ్రంగా వేధిస్తోందన్నారు. సీఐఐ విశాఖపట్నం చాప్టర్ మాజీ ఛైర్మన్ కేవీవీ రాజు మాట్లాడుతూ పట్టణీకరణ అభివృద్ధి చెందుతున్నందున నగరాలను స్మార్ట్‌గా మార్చడం ఎంత అవసరమో నీటిని కూడా స్మార్ట్‌గా వినియోగించడం అంతే అవసరమన్నారు. ఎన్‌ఏసీఎల్ ఏజీఎం చిన్న దురై తదితరులు మాట్లాడారు. సదస్సులో సీఐఐ, విశాఖపట్నం వైస్ ఛైర్మన్ రాజేష్ గ్రంధి, జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ప్రాజెక్ట్స్) ప్రెసిడెంట్ ఎంవీ చారి తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో యానిమల్ హౌస్ ఏర్పాటు

ఒప్పందం చేసుకున్న రొడెంటా బయో సర్వ్ సంస్థ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శాస్త్రీయ పరిశోధనలకు ఉపయుక్తంగా యానిమల్ హౌస్ ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి హైదరాబాద్‌కి చెందిన రొడెంటా బయోసర్వ్ సంస్థ ఏయూతో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో మంగళవారం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, రొడెంట సంస్థ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ కె.ఆనంద్ కుమార్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. వర్సిటీలో ఫార్మసీ, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, జువాలజీతో పాటు జీవశాస్త్ర కోర్సులు అభ్యసించే పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఉపయుక్తంగా దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఏయూలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలిమెంట్ భవనానికి అనుసంధానంగా.. నెల రోజుల్లో ఈ కేంద్రం పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభించనుంది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీల్లో ఇటువంటి కేంద్రం ఉండడం అరుదైన విషయమని, రెండు దశల్లో దీనిని విస్తరిస్తామన్నారు. డాక్టర్ కె.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ నగరంలోని వివిధ పరిశ్రమల అవసరాలు తీర్చుతూ ఆదాయ వనరుగా ఈ కేంద్రం నిలుస్తుందన్నారు. ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, డీన్ ఆచార్య కె.బసవయ్య, ఆచార్య ఈశ్వర కుమార్, గిరిజా శంకర్, శైలజ, మురళీకృష్ణ కుమార్ పాల్గొన్నారు.

తప్పు చేస్తే శిక్ష తప్పదనే భయం ఉండాలి



- వివక్షను రూపుమాపేందుకే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం
- ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డి.వి.జి.శంకరరావు

సీతమ్మధార: సమాజంలో నెలకొన్న వివక్షను రూపుమాపడానికి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని తీసుకొచ్చిందని ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డి.వి.జి.శంకరరావు అన్నారు. సీతమ్మధారలోని ఓ కల్యాణ మండపంలో ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ సెల్, సీఐడీ సంయుక్తంగా 'ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలు, వారిపై జరుగుతున్న దాడులు, నివారణ' అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించాయి. డీఎల్ఎస్‌సీ ఛైర్‌పర్సన్, జడ్జి ఎం.వి.శేషమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం స్ఫూర్తితో చట్టాలను అమలు చేయాలన్నారు. బలహీన వర్గాలు ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్టీ కమిషన్ ఛైర్మన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులను కల్పించిందన్నారు. సమాజంలో అన్ని వర్గాల మనుషులు ఉంటారని.. తప్పు చేస్తే శిక్ష తప్పదనే భయం నెలకొన్నప్పుడు వివక్షకు తావుండదన్నారు. అనీల్ కుమార్ మాట్లాడుతూ విచారణ అధికారి పారదర్శకంగా వ్యవహరించినప్పుడు బాధితులకు సరైన న్యాయం దక్కుతుందన్నారు. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు.

క్లుప్తంగా

పరవాడపాలెంలో 'గడప గడపకు' నేడు

కశింకోట: మండలంలోని పరవాడపాలెం గ్రామంలో బుధవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుందని ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు, అభిమానులు హాజరు కావాల్సిందిగా కోరారు.

చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు



కనకమహాలక్ష్మి వీధిలో వినాయక చలువ పందిరి

కశింకోట: వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కశింకోటలో యువకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీధుల్లో చలువ పందిళ్లు, ముఖ ద్వార సెట్టింగ్‌ల ఏర్పాటులో బిజీగా ఉన్నారు. గణేశుని ప్రతిమను ఏర్పాటు చేసే వేదికలనున అందంగా ముస్తాబు చేస్తున్నారు. ఈ వేదికలపై ఈ నెల 18న తొలి దైవం వినాయకుని విగ్రహాలను కొలువుదీర్చి, నవరాత్రి ఉత్సవాలు జరిపేందుకు సన్నద్ధమవుతున్నారు.

శరవేగంగా డ్రైనేజీల నిర్మాణం



పూసర్ల వీధిలో నిర్మాణంలో ఉన్న డ్రైనేజీ

కశింకోట: మేజర్ పంచాయతీ కశింకోటలో సుమారు రూ.45 లక్షలతో మురుగునీటి కాలువల నిర్మాణ పనులు చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన నిధులతో పలు ప్రాంతాల్లో సీసీ డ్రైనేజీలను నిర్మిస్తున్నామన్నారు. పూసర్ల వీధిలో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీపడవద్దని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 233 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,600	4,600
రెండో రకం	4,100	4,390
మూడోరకం	4,040	4,140

అనకాపల్లి సినిమాలు

ది నన్	: రాజా
గోవిందా భజగోవిందా	: సత్యనారాయణస్క్రీన్-1
తురుమ్ ఖాన్‌లు	: సత్యనారాయణస్క్రీన్-2
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి	: షిర్డిసాయి
జవాన్	: షిర్డిసాయి
జవాన్	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
ఖుషి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-18 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 341 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 329 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924 223595)ని సంప్రదించవచ్చు.

సీఎం జగన్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి



స్వయం సహాయక సంఘాలకు రూ.కోటీ 90 లక్షల బ్యాంకు లింకేజీ రుణాల చెక్‌ను అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా జగన్ పాలన
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్

కశింకోట: మారుమూల గ్రామాలను సైతం కోట్ల రూపాయాల నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు రూ.కోటీ 85 లక్షలతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతితో కలిసి ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాలకు రూ.కోటీ 90 లక్షల బ్యాంకు లింకేజీ రుణాల చెక్‌ను అందించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని కుటుంబాల వారీగా గణాంకాలతో సహా వివరించారు. సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేసి, అర్హులై ఉండీ, సంక్షేమ లబ్ధి పొందని వారు వెంటనే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ఇంటింటికీ తిరిగిన మంత్రికి అడుగడుగునా మహిళలు మంగళ హారతులు పట్టారు. పూల వర్షం కురిపించారు. పలువురు దుశ్శాలువాలు కప్పి మంత్రి, ఎంపీలను సత్కరించారు.



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంతోపాటు దేశానికి పట్టుగొమ్మలైన గ్రామాలను అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. తద్వారా జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇప్పటికే ఎక్కడా లేని విధంగా గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రభుత్వ సేవలను ప్రజలకు అతి చేరువ చేసిన విషయాన్ని వివరించారు. గ్రామ/వార్డు వలంటీర్ల నియామకం ద్వారా పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దే అందిస్తూ అవ్వా తాతలు, దివ్యాంగులు, వితంతువులకు ఆసరాగా నిలుస్తున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం అమ్మ ఒడి, రైతుల సంక్షేమానికి రైతు భరోసా, మహిళలకు వైఎస్సార్ ఆసరా, నేతలకు నేతన్న నేస్తం తదితర సంక్షేమ పథకాలను అందిస్తూ బడుగు, బలహీన వర్గాలను ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా సహకరించాల్సిందిగా కోరారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో డాక్టర్‌కు ప్రత్యేక గది కేటాయించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్‌కు మంత్రి సూచించారు. అనంతరం ఎస్సీ కాలనీలో నవ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ కె.విష్ణుమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ నమ్మి మీనా, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్ యు.రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు గూడెపు లక్ష్మి, తీడ సర్పంచ్ చిరికి సత్యనారాయణ, స్థానిక నాయకులు కలగా ప్రసాద్, గుటాల తులసీరావు, జల్లూరి అప్పారావు, కోన నాగేశ్వరరావు, చిన్ని సన్యాసినాయుడు, లగిశెట్టి గణేష్, ఇందలి ముసిలినాయుడు, కలిగెట్ల నాయుడు, నీటిపల్లి దివాకర్, చిన్ని రాజీవ్, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, డీఈ సత్యనారాయణ, మండల హౌసింగ్ ఏఈ వి.శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి ఈవోఆర్డీ ఎన్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త అమావాస్య వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం

- నూకాంబిక ఆలయ ఛైర్మన్ కొణతాల మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: కొత్త అమావాస్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నూకాంబిక ఆలయ ఛైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. గవరపాలెం అమ్మవారి ఆలయ ఆవరణలో మంగళవారం నూతన పాలకవర్గం, కమిటీలతో ఆయన సమావేశమయ్యారు. వచ్చే ఏడాది మార్చి నెలలో వచ్చే కొత్త అమావాస్య జాతర, ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఇప్పటి నుంచే చేయాలని ఆలయ అధికారులకు సూచించారు. వచ్చే నెల అక్టోబర్‌లో జరిగే శరన్నవరాత్రి వేడుకల్లో రోజుకో అవతారంలో అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయంలో తొమ్మిది రోజులూ ప్రత్యేక పూజలతో పాటు, సామూహిక కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. కొత్త అమావాస్య జాతరకు 45 రోజుల ముందు మాలధారణ భక్తులు అమ్మవారి దీక్షలు బూని ఉదయం, సాయంత్రం అమ్మవారికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దీక్షలు భూనిన భక్తులు అమ్మవారికి నిర్వహించే భారీ అంబలం పూజకు రూ.10 లక్షలు ఖర్చు చేస్తారన్నారు.



మాట్లాడుతున్న కొణతాల మురళీకృష్ణ

అమ్మవారి మాలధారణకమిటీ సభ్యుడు ఆదిబాబు అమావాస్య యూత్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏడాది పొడవునా రూ.లక్షతో అమ్మవారి అమావాస్య పూజలో వెయ్యిమందికి అన్నప్రసాదాన్ని అందించడం అభినందనీయమన్నారు. అమ్మవారి మూలవిరాట్ దేవాలయం పునర్నిర్మాణంలో ఉందని, తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బాలాలయంలో భజనలు నిరాటంకంగా కొనసాగించాలని భజన మండలి సభ్యులను ఆయన కోరారు. నిర్వాహకులు పొలిమేర శ్రీను, కాండ్రేగుల సోమేష్, పాలమరిశెట్టి కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పీలా లక్ష్మీశ్రీనివాస్, బుద్ద నర్సింగరాజు, పాలకవర్గ సభ్యులు కొండూరు రవీంద్రనాథ్, మల్లవరపు ఈశ్వరరావు, వై.వాసు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



తాళ్లపాలెం కొత్త పింఛన్లు అందిస్తున్న గణేష్

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ పరిధిలో కొత్తగా 9 మందికి మంజూరైన పింఛన్లను మంగళవారం అందజేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో సీఎం జగన్ పాలన సాగుతోందన్నారు. అర్హులైన వారు ఎప్పుడు దరఖాస్తు చేసుకున్నా, సంక్షేమ లబ్ధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

8 మందికి కంటి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్ చేయించుకున్న రోగులతో రోటరీ క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం ఏఎంఏవీఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మంది రోగులకు ఐవోఎల్ ఆపరేషన్లు ఉచితంగా చేసినట్లు ఆస్పత్రి అధ్యక్షుడు బి.కె.నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం 44 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 8 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకున్న రోగులను మూడు రోజులు ఆస్పత్రిలో ఉంచి, వారికి కావలసిన మందులు, భోజనం ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ నేత్ర వైద్యసహాయకురాలు పి.దేవి, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణులకు అండగా ఫ్యామిలీ డాక్టర్

అనకాపల్లి రూరల్: ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశంలో ఎక్కడా లేదని, కేవలం మన రాష్ట్రంలోనే అమలవుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. మంగళవారం తగరంపూడి పీహెచ్‌సీని ఆయన పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది, రోగులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యం కోసం కోట్లాది రూపాయల నిధులను ఖర్చు చేస్తోందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు మెరుగైన, అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చేలా ఎన్నో సంస్కరణలు అమల్లోకి తెచ్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.



తగరంపూడి పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

నల్లమారమ్మ ఆలయంలో రత్నాకర్ పూజలు

మండలంలోని వెంకుపాలెం నల్లమారమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం శాలువాతో దాడి సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ తనను కొలిచే భక్తుల పట్ల అమ్మవారి చల్లని కరుణ ప్రసరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ రాపేటి వెంకటేష్, బొడ్డపాటి చిన రాజారావు, దాడి గణేష్, బుద్ధ శివనాయుడు, మళ్ల రమణ బాబు, రాపేటి తాతారావు, బుద్ధ చిరంజీవి, బుద్ధ శేఖర్, రాపేటి రామకృష్ణ, ఆడారి నరసింగరావు, వేగి కోటి తదితరులు పాల్గొన్నారు.

15న అయ్యప్పకు పంచామృతాభిషేకాలు

మునగపాక: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 15న పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఉత్తర ఫల్గుణ నక్షత్రం సందర్భంగా ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

అవగాహనతోనే హెచ్ఐవీకి దూరం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల, తిమ్మరాజుపేటలో ఎంపిక చేసిన వారికి హెచ్ఐవీ పరీక్షలు మంగళవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఐసీటీసీ మొబైల్ కౌన్సిలర్ అర్జున్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు హెచ్ఐవీ పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రావాలన్నారు. అవగాహనతోనే హెచ్‌వీకి దూరంగా ఉండవచ్చన్నారు.

ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా రాము

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం హరిపాలెం-అందలాపల్లి ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా బుద్ధ వెంకటసత్యరాము నియమితులయ్యా రు. జిల్లాలో పేరొందిన భగీరథమ్మ ఉత్సవాలు నిర్వహించడంతో పాటు, ఏడాది కాలం అమ్మవారి పండగలను, ఉత్సవాలను ఈ కమిటీ పర్యవేక్షించనుంది. కార్యదర్శిగా కాండ్రేగుల అప్పారావు, కోశాధికారిగా సూరిశెట్టి వెంకట గాంధీ అప్పారావు, సభ్యులుగా జగదీష్, మోహనరావు, లక్ష్మీనారాయణ, భాగ్యరాజ్, శ్రీనివాసరావు, కొండబాబు, ఈశ్వరరావులనుఎన్నుకున్నారు.

నాడు-నేడు రెండో దశ పనుల్లో వేగం పెంచాలి

- అధికారులతో సమీక్ష జరిపిన ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి రూరల్: మడలంలోని పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు రెండో దశ పనులపై మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు మంగళవారం సమీక్ష జరిపారు. పనులు జరుగుతున్న స్కూళ్లలో పురోగతిని అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఎక్కడెక్కడ పనుల్లో జాప్యం జరుగుతుందో, అందుకు గల కారణాలను పాఠశాలల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుల నుంచి ఆరా తీశారు. ప్రభుత్వ ప్రాధాన్య అంశాల్లో ఒకటైన పాఠశాలల్లో నాడు-నేడు పనుల్లో నిర్లక్ష్యం చూపవద్దని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులతో నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు.



నాడు నేడు పనులపై సమీక్ష జరుపుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

సీఎం లక్ష్యానికి అనుగుణంగా సకాలంలో పనులు పూర్తి చేసి, విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ నరసింహారావు, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు, ఎంఈవోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం

- అనకాపల్లి డివిజన్ ఆర్‌డీవో చిన్నికృష్ణ

సబ్బవరం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలన పూర్తి చేశామని, తప్పులు లేని పరిపూర్ణమైన ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నట్టు అనకాపల్లి డివిజన్ ఆర్‌డీవో చిన్నికృష్ణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. అక్టోబర్ 17వ తేదీ నాటికి డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తామన్నారు. అనంతరం నెల రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించి సరి చేస్తామని చెప్పారు. జనవరి 5న తుది జాబితా ప్రదర్శిస్తామన్నారు. ఇంటింటికీ వెళ్లి బీఎల్‌వోలు నిర్వహించిన సర్వేలో మరణించిన, ఇల్లు మారిన, డూప్లికేట్ ఓటర్లను గుర్తించామన్నారు. ఇకపై జీరో డోర్ నంబర్లు కనిపించకుండా సమగ్రంగా సర్వే నిర్వహించినట్టు వివరించారు. ఇప్పటి వరకు జనవరి 1న మాత్రమే ఓటరు నమోదు ప్రక్రియ జరిగేదని, ఇకపై జనవరి 1తో పాటు ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1న కూడా నమోదు కార్యక్రమం చేపడతామన్నారు. 17 నుంచి 18 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన యువతీ, యువకులు భావి ఓటర్లుగా నమోదు చేయించుకుంటే 18 సంవత్సరాలు నిండిన తరువాత ఆటోమేటిక్‌గా ఓటు హక్కు పొందవచ్చునన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న జగనన్న చెబుతాం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. వచ్చిన ప్రతి అర్జీని వీఆర్వో స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో మొదటి దశలో 93 గ్రామాల్లో సమగ్ర రీసర్వే పూర్తి చేశామన్నారు. రెండో దశలో 123 గ్రామాలకు ఇప్పటికే 90 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. మూడో విడతలో మరో 68 గ్రామాల్లో రీసర్వే ప్రారంభిస్తున్నట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనకాపల్లి డివిజన్ ఆర్‌డీవో చిన్నికృష్ణ

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



తేగాడ ఆదర్శ పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాలను అందిస్తున్న స్పందించే హృదయం ప్రతినిధులు

కశింకోట: పర్యావరణ హిత వినాయక చవితి ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తేగాడలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఐ.మార్తా తిలకం కోరారు. స్పందించే హృదయం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మట్టి వినాయకుడు-పర్యావరణ పరిరక్షణ అంశంపై అవగాహన కల్పిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సుమారు 300 మంది విద్యార్థులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి వినాయక ప్రతిమలను పూజించి, జలాశయాల్లో నిమజ్జనం చేయడం వల్ల సారవంతమైన మట్టి నీటి ప్రవాహంతోపాటు కొట్టుకుపోయి పంట పొలాల్లోకి చేరుతుందన్నారు. దీంతో పంటలు బాగా పండటంతో పాటు, నీరు కలుషితం కాదన్నారు. సంస్థ సభ్యుడు కాకి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించి, మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలైన బి.రేవతి, ఎస్.హరీష్‌రాజ్, ఎ.హేమలతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.లక్ష్మి, ఉపాధ్యాయులు ఎస్.రాజేశ్వరి, ఆర్.సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్యాలకు ప్రతీక భరత నాట్యం

అనకాపల్లిటౌన్: సంప్రదాయ నృత్యాలకు భరతనాట్యం ప్రతీక అని గౌరీ పంచాయతన దేవాలయ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసిరావు అన్నారు. శ్రావణ మాస ఆఖరి మంగళవారం సందర్భంగా ఆలయ ఆవరణలో జరిగిన 40 మంది చిన్నారులతో భారత నాట్య ప్రదర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు శాస్త్రీయ నృత్యంలో తర్ఫీదునిచ్చేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఆలయంలోని గౌరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. చిన్నారులు చేసిన భరతనాట్యం ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి బుద్ద రమణాజీ, కోశాధికారి కర్రి శివ సూర్యనారాయణ, సభ్యులు ఏఎల్ఆర్ నర్సింగరావు, పెంటకోట ఉమామహేశ్వరరావు, పెంటకోట బాలకృష్ణ, అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, ఆలయ సిబ్బంది ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



భరత నాట్యం చేసిన చిన్నారులతో ఆలయ కమిటీ సభ్యులు

యూబీఏ ఇంటింటా సర్వేలో డైట్ విద్యార్థులు

అనకాపల్లిటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉన్నత్ భారత్ అభియాన్(యూబీఏ) కార్యక్రమాన్ని డైట్ కళాశాల దత్తత తీసుకున్న అక్కిరెడ్డిపాలెం, కేటీవీ పాలెం, బట్లపూడి, రేబాక, శంకరం గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూబీఏ ప్రొగ్రాం కో ఆర్డినేటర్ భీశెట్టి పావని మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటినీ సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నామన్నారుర. ప్రధానంగా రహదారులు, తాగునీరు, కాలుష్య సమస్యలపై ప్రజలను ఆరా తీసినట్లు పేర్కొన్నారు. అక్షరాస్యత, ప్రతి గృహంలో పని చేసే వారి వివరాలను సేకరించామన్నారు. కేంద్ర ప్రభుత్వం అభివృద్ధికి నోచుకోని గ్రామాలను గుర్తించి అక్కడ నివసిస్తున్న ప్రజల్లో సాంకేతికతపై అవగాహన పెంచి, వారి అభివృద్ధికి తోడ్పడటమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



యూబీఏలో భాగంగా ఇంటింటా సర్వే చేస్తున్న విద్యార్థులు

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

అనకాపల్లిటౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 14 నుంచి నిర్వహించనున్నట్లు మండల కో ఆర్డినేటర్ ఎస్వీ నరసింహం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈ నెల 14 ఉదయం 8.30 గంటల్లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. 14న జీవీఎంసీ పెద్ద హైస్కూల్‌లో వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, 15న జీవీఎంసీ గవరపాలెం చిన్నహైస్కూల్లో ఖోఖో, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, 16న ఎన్టీఆర్ క్రీడామైదానంలో బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ క్రీడాపోటీలకు ప్రభుత్వ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9247150037 మొబైల్ నంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

నిమజ్జనోత్సవ ఏర్పాట్లకు వినతి

అనకాపల్లిటౌన్: స్థానిక శారదానది ఘాట్ వద్ద వినాయక నిమజ్జనోత్సవాలకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని కోరుతూ జెడ్సీ వెంకటరమణను వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జన కమిటీ సభ్యులు జోనల్ కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ నెల 18న వినాయక చవితిని పురస్కరించుకుని ఆ రోజు సాయంత్రం నుంచి ఘాట్ వద్ద గత ఈతగాళ్లు, లైటింగ్, శానిటేషన్ తదితర ఏర్పాట్లు చేయాలని వినతిపత్రంలో కోరారు.



జెడ్సీ వెంకటరమణకు వినతిపత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు